జనావాసాల మధ్యే డంపింగ్‌యార్డు



డంపింగ్‌యార్డు పక్కనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు. (పక్కనే నిర్మాణంలో ఉన్న గురుకుల కాలేజీ)

తరలించాలని కోరుతున్నా పట్టించుకునే వారే కరువు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చెత్త సమస్య వీడటం లేదు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో చెత్త సమస్య సైతం తీవ్రమవుతోంది. నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లో వందలాది అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు హైరైజ్ అపార్ట్‌మెంట్లు రోజురోజుకు వెలుస్తుండటంతో ఇక్కడ చెత్త సేకరణ అధికారులు పెను సవాలుగా మారింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సుమారు 200 వరకు చెత్త ఆటోలతో చెత్తను సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన చెత్త ప్రతి రోజు 100 టన్నులకు పైగానే ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. మరి ఇంత చెత్తను ప్రస్తుతం వేస్తున్న డంపింగ్‌యార్డులో వేస్తున్నారు. ఇక్కడ చెత్తను వేసేందుకు స్థలం సరిపోకపోవడం ఒక సమస్య అయితే ఈ డంపింగ్‌యార్డు జనావాసాల మధ్య ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడి నుంచి చెత్త డంపింగ్ యార్డును తొలగించాలని పలుమార్లు స్థానిక ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు.

ప్రజలకు ఇబ్బందిగా...

డంపింగ్ యార్డు పక్కనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసింది. ఇక ఇక్కడ ప్రజలు ఇక్కడే నివాసం ఉండే విధంగా అధికారులు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మరో రెండు, మూడు నెలల్లో ఇక్కడ పూర్తి స్థాయిలో ప్రజలు నివాసం ఉండే అవకాశం ఉంది. ఇక సాయినగర్, ఆదిత్యగార్డెన్, రాజీవ్ గృహకల్ప, జర్నలిస్టుకాలనీ, హిల్‌కౌంటీ కాలనీల ప్రజలకు మాత్రం తీవ్ర దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు విషజ్వరాల బారిన పడి అనేక అవస్థలు పడుతున్నారు.

వాహనదారులకు తప్పని తిప్పలు...

నిజాంపేట్ నుంచి జర్నలిస్టు కాలనీ, డబుల్‌బెడ్ రూంల సముదాయం, తెలుగు యూనివర్సిటీ మీదుగా వెళ్లే 100 ఫీట్ల రోడ్డు మియాపూర్ మేడ్చల్ రోడ్డును వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి కాలేజీ వద్ద కలుస్తుంది. దీంతో ఈ రోడ్డులో ప్రతి రోజు వందలాది వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ రోడ్డు పక్కనే డంపింగ్‌యార్డు ఉండటంతో ప్రతి రోజు ఈ రోడ్డులో వెళ్లే వాహనాలకు డంపింగ్‌యార్డు వద్ద చెత్త ఆటోలు, లారీలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా స్కూల్ బస్సులకు ఇబ్బందులు ఎక్కువగా ఏర్పడుతున్నాయి.

విద్యా సంస్థల సమీపం నుంచి డంపింగ్‌యార్డును తొలగించాలి...

తెలంగాణ సాంఘిక గురుకుల బాలికల డిగ్రీ కాలేజీ, స్కూల్ ప్రస్తుతం డంపింగ్ యార్డు పక్కనే నిర్మాణం జరుగుతోంది. అంతే కాకుండా తెలుగు విశ్వవిద్యాలయం సైతం పక్కనే ఉంది. డంపింగ్‌యార్డు ఇక్కడే కొనసాగితే విద్యార్థులకు సైతం తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. మరో మూడు నాలుగు నెలల్లో గురుకుల డిగ్రీ కాలేజీ సైతం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ ఉన్న డంపింగ్‌యార్డును తరలించే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.





డంపింగ్‌యార్డులో కుప్పలుగా పేరుకుపోయిన చెత్త

సాధ్యమైనంత తొందరలో పరిష్కరిస్తాం



చెత్త సమస్య వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే రాంకీ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. త్వరాలోనే చెత్త ఆటోలకు ఓ ర్యాంపు ఏర్పాటు కాంప్యాక్టర్‌లో వేసే విధంగా అక్కడి నుంచి టిప్పర్‌ల ద్వారా రాంకీ తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడి నుంచి శాశ్వతంగా డంపింగ్ యార్డును తరలించలంటే ప్రభుత్వం నుంచి డంపింగ్ కోసం మరో స్థలం కేటాయిస్తే ఇక్కడి నుంచి తరలిస్తాం. దీని కోసం సైతం తాము ఉన్నతాధికారులతో సంప్రదిస్తున్నాం. సాధ్యమైనంత తొందరలో సమస్యను పరిష్కరిస్తాం.

– రామకృష్ణారావు, కమిషనర్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ గ్రామంలోని సర్వే నం.82లోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ బుధవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలం కబ్జా చేసేందుకు కొంత మంది ప్రైవేటు నంబర్లు ఉన్న డాక్యుమెంట్లతో సర్వే నం.82లో నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని రెవెన్యూ అధికారులే తెలిపారన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని కోరారు. ఈ స్థలాన్ని ప్రజావసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ రామకృష్ణారావు అందుబాటులో లేకపోవడంతో మేనేజర్ చంద్రప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమలేశ్వరీ, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రాజు నివాసానికి కేటీఆర్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసానికి బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విచ్చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. - కుత్బుల్లాపూర్

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం



జగద్గిరిగుట్టలో ప్రజలతో మాట్లాడుతున్న డీసీపీ

జగద్గిరిగుట్ట: నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ అన్నారు. బుధవారం బాలానగర్ డీసీపీ జోన్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోపల పరిసరాలను పరిశీలించిన ఆయన అనంతరం ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదుదారులకు వచ్చిన వారితో మాట్లాడుతూ... లాఅండ్‌ఆర్డర్‌ను రక్షించాలంటే పోలీసులకు ప్రజల తోడ్పాటు అవసరమని అన్నారు. అనంతరం ఆయన స్టేషన్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సైలతో మాట్లాడారు. పోలీసులపై నమ్మకంతో స్టేషన్‌కు వచ్చిన ప్రజలకు తప్పనిసరిగా న్యాయం చేయాలని సూచించారు. కాలనీలు, బస్తీల్లో పోలీసులు తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించి గంజాయి విక్రయించే వారితో పాటు క్రిమినల్స్‌ను పట్టుకుని కేసులు నమోదు చేయాలని అన్నారు. అదే విధంగా బహిరంగంగా మద్యం తాగే వారితో పాటు నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటా



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి నియోజకవర్గ పరిధిలోని పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై స్థానిక సమస్యలపై వినతులు, అదే విధంగా పలువురు ఆహ్వాన పత్రికలును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్‌గౌడ్, ఏఐటీయూసీ నాయకుడు ఐలయ్య తదితరులు ఉన్నారు.

యాంటీ డ్రగ్ డే ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలల్లో బుధవారం యాంటీ డ్రగ్ డేను నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్ తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యంపై జరిగే అనార్థాలను వివరించారు. కళాశాల డైరెక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ.. కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని అన్నారు. వారిలో మార్పు తీసుకువచ్చే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వందల మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళి ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ అర్షబ్ మాలిక్, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సేవా అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వందలాది కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ గత పదేళ్లుగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

సేవా అవార్డుతో సత్కారం..

◆ స్పాస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను గౌరవ బ్లాక్ బెల్ట్ - గ్రాండ్ మాస్టర్ చ్యూచూ సూట్ మెమోరియల్ సేవా అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటే సాధన ఆత్మ సంరక్షణతో పాటు శరీర దృఢత్వానికి దోహద పడుతుందన్నారు. నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలన్నారు. గ్రాండ్ మాస్టర్ సలీమ్ జావీద్ బైగ్, మాస్టర్లు మీర్జా రషీద్ బైగ్, ఖాజా పాషా, షోయబ్ బైగ్, ఎండీ బషీర్, సమీర్ బైగ్, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షుడు విజయ్ రామిరెడ్డి, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, మక్సూద్ భాయ్, మొయిజ్, మహమ్మద్ యూసఫ్, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

కుత్బుల్లాపూర్: ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సుచిత్రలోని శ్రీచైతన్య పాఠశాలకు కుత్బుల్లాపూర్ ఎంఈఓ వసంతకుమారి షోకాజ్ నోటీసులు అందజేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ దుర్గా ఎస్టేట్ మూడు గుండ్ల ఎదురుగా శ్రీ చైతన్య పేరిట అనుమతులు లేకుండా పాఠశాలను ఏర్పాటు చేశారు. దీంతో కుత్బుల్లాపూర్ ఎంఈఓ పాఠశాలను సీజ్ చేశారు. అయినా పాఠశాల నిర్వాహకులు ఎంఈఓ ఆదేశాలను ఖాతరు చేయకుండా అడ్మిషన్లు తీసుకుంటూ వచ్చారు. బుధవారం శ్రీచైతన్య పాఠశాల ప్రారంభమవుతుందని తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలకు వచ్చి మూడోసారి షోకాజ్ నోటీసులు అందజేశారు. అనుమతులు తెచ్చుకోవడానికి తమకు 15 రోజులు గడువు ఇవ్వాల్సిందిగా పాఠశాల నిర్వాహకులు కోరారు. మూడు రోజులు మాత్రమే గడువు అంటూ నోటీసులు ఇచ్చి వెళ్లిపోయారు.

మరోసారి ధర్నా..

విషయం తెలుసుకున్న బడ్జెట్ పాఠశాల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు బుధవారం మరోసారి పాఠశాల ఎదుట ధర్నా చేశారు. విద్యాశాఖ అధికారులు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీస్ శాఖ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి



పోలీస్ శాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: పోలీస్ శాఖకు కేటాయించిన భూములకు వెంటనే సరిహద్దులు ఏర్పాటు చేయాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని సర్వే నం.166లో గతంలో పోలీసు శాఖకు 60 ఎకరాలను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఔటర్ రింగ్ రోడ్డులో 30 ఎకరాలు పోగా మరో 30 ఎకరాలు మిగిలి ఉంది. దీంతో సదరు స్థలాన్ని బుధవారం డీసీపీ కోటిరెడ్డి సందర్శించారు. పోలీస్ శాఖకు కేటాయించిన స్థలానికి చుట్టు సరిహద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, రెవెన్యూ అధికారి భారతి, సర్వేయర్ రూప తదితరులు ఉన్నారు.

పాఠశాల మూసివేత.. తల్లిదండ్రుల ఆందోళన

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్‌లోని జయరామ్‌నగర్‌లో ఉన్న సెయింట్ మోసెస్ పాఠశాలను విద్యార్థులకు సరిపడా సామర్థ్యం లేదని యాజమాన్యం బుధవారం అర్ధంతరంగా మూసివేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. 2024- 25 విద్యా సంవత్సరం ఆరంభమై నెల రోజులు గడిచిన తరువాత ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్కూల్‌ను మూసివేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యజమాని హజ్ యాత్రలో ఉన్నారని...

పాఠశాల యాజమాని సయ్యద్ బాకర్ హజ్ యాత్రలో ఉన్నారని ఆయన ఆదేశాల మేరకే పాఠశాలను మూసివేసినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. దీనిపై మండిపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. అయితే విద్యా సంవత్సరానికి సంబంధించి కొంత రుసుము ఇప్పటికే చెల్లించామని తెలిపారు. ఇప్పటికిప్పుడు పాఠశాలలను మూసివేస్తే తమ పిల్లలను ఎక్కడ చేర్పించాలని వాపోయారు.

విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలి...

ఇప్పటికే పాఠ్యాంశాల్లో కొంత పోర్షన్‌ను ముగించుకుని తమ పిల్లలు ఇంటర్నల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఫీజులు తిరిగి చెల్లిస్తామని పాఠశాల యాజమాన్యం చెబుతున్నా తమ పిల్లల భవిష్యత్ ఏమి కావాలని ప్రశ్నించారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్లు తవ్వి వదిలేస్తే ఎలా..?

మంచిగ ఉన్న రోడ్లను డ్రైనేజీ, వాటర్ కనెక్షన్ పేరుతో తవ్వకాలు

కుత్బుల్లాపూర్: అధికారుల అవగాహన లోపం కారణంగా సిమెంట్ రోడ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి వేసిన రోడ్లను ఎటువంటి ప్రణాళిక లేకుండా తవ్వి వదిలేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాయత్రినగర్‌లో సుమారు రూ.5కోట్లతో సిమెంట్ రోడ్డు పనులు పూర్తి చేశారు. అంత వరకు బాగానే ఉంది. ఓ వ్యక్తి డ్రైనేజీ, వాటర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా సంబంధిత అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టర్ వచ్చి బంగారం లాంటి రోడ్డును తవ్వి వదిలేశాడు. లెవెలింగ్ లేదని మరోచోట తవ్వి ఎటువంటి మరమ్మతులు లేకుండానే వెళ్లిపోయాడు.

అవగాహన లోపంతో తవ్వి వదిలేసి..

ఇదేమని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేందర్ సింగ్ అధికారులను ప్రశ్నించగా రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని వాటర్ వర్క్స్ అధికారి శివప్రసాద్ హామీ ఇచ్చారు. ఫోన్ చేసిన ప్రతిసారి ఇప్పుడే చేస్తానంటూ కట్ చేస్తూ సమాధానం చెప్పకుండా తప్పించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై అధికారులు స్పందించకుంటే వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్థానికులు హెచ్చరించారు. ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్తామని తెలిపారు. ఇదే విషయంపై వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా కాలనీవాసులే పైపులైన్ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని.. ఇందులో తమ జోక్యం ఏమీ లేదని చెప్పడం గమనార్హం.



గాయత్రినగర్‌లో ఇలా రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

టీవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కోటిరెడ్డికి 'ఉగాది కీర్తిరత్న' పురస్కారం



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన టీవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కోటిరెడ్డిని ఫెడరేషన్ ఆఫ్ ఎన్‌ఆర్‌ఐ కల్చరల్ అసోసియేషన్ (ఎఫ్ఎన్‌సీఏ) ×ఉగాది కీర్తిరత్న¶పురస్కారానికి ఎంపిక చేసింది. విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రకటించినట్లు ఎఫ్ఎన్‌సీఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంజేఆర్ ప్రసాద్ తెలిపారు. ఈనెల 29న మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని కాస్మో హోటల్‌లో జరిగే కార్యక్రమంలో కోటిరెడ్డి అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ. ప్రతిష్టాత్మక ఎఫ్ఎన్‌సీఏ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు సైతం విద్యాభివృద్ధికి, ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తానన్నారు.

అధిక ఫీజుల కట్టడికి ప్రత్యేక చట్టం తేవాలి



విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న ఏబీవీపీ కార్యకర్తలు

సుభాష్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి (కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్) ఆత్మకూరి శ్రీనాథ్ అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు, ఉపాధ్యాయులు లేకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. అధిక ఫీజులను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. స్కూల్ పుస్తకాలు, యూనిఫామ్‌లతో పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్లు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని సింహపురి కాలనీలో రూ.28 లక్షలతో సీసీరోడ్డు, రూ.26 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు బెంబడి వనిత, శంభీపూర్ కృష్ణలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని అన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, ధర్మారెడ్డి, రంగయ్య, రాంకుమార్, నరసింహారెడ్డి, నవీన్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విల్లాల కొనుగోలు చెల్లవంటూ కోర్టు నోటీసులు

ఆందోళనకు దిగిన ప్రణీత్ లీఫ్ విల్లాల కొనుగోలుదారులు



ప్రణీత్ లీఫ్ వద్ద ఆందోళనకు దిగిన విల్లాల కొనుగోలుదారులు

దుండిగల్: మల్లంపేట్‌లోని సర్వే నం.121, 122లోని ప్రణీత్ లీఫ్‌లో విల్లాలు కొనుగోలు చేసిన వారు బుధవారం ఆందోళనకు దిగారు. సదరు స్థల కౌలుదారుడు ఎంబరి రాములు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రణీత్ లీఫ్ యాజమాన్యం స్థలాన్ని కబ్జా చేసిందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో 34 గుంటలకు సంబంధించి విల్లాలు కొనుగోలు చెల్లవంటూ కోర్టు నుంచి లీగల్ నోటీసులు వచ్చాయి. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ విల్లాలు కొనుగోలు చేసిన యాజమనులు ఆందోళనకు దిగారు.

ఎక్సెల్ విరిగిపోయింది.. ట్రాఫిక్ నిలిచిపోయింది!



ఎక్సెల్ విరిగిపోయిన లారీని క్రేన్ సహాయంతో పక్కకు తప్పిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: మహారాష్ట్ర నుంచి దూలపల్లి పారిశ్రామికవాడకు 25 టన్నుల పైపులతో వస్తున్న లారీ బుధవారం కొంపల్లి రోడ్డులో ఎక్సెల్ విరిగిపోవడంతో నిలిచిపోయింది. దీంతో రోడ్డుపై కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న అల్వాల్ ట్రాఫిక్ ఎస్సై శ్యామ్‌బాబు ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని క్రేన్ సహాయంతో లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.